



# పాంచాలమ్మ పాట

స.వెం. రమేశ్

**బా**ట ఎంత గొప్పది. కులకతానో కుంటతానో మనం దానిమీద అడుగట్ట పెడితే చాలు, బతుకంతా నడిపిస్తాది మనల్ని. నడవలేని నాళ్లు వచ్చి పైన పడినాక, దవ్వగల్లు మాదిరిగా బతుకు నిలిచిపొయినాక, అప్పుడు కూడా తలపోతలయి వచ్చి తడిమేసి పోతుంటాది తెరువు. ఎన్నడో ఏనాళ్లలోనో ఎన్నేళ్లలోనో చవిగొన్న చనవులను మన ముందు నిలుపుతుంటాది చనుప. మరచిన గురుతులను నెరిపి నెమ్మిని నింపి పోతుంటాది నెరవు.

నరుల అలికిడిలేని ఇరులరేయిలో ఒంటిగా-బండి దడము మీదనో, ఏటి బడిమి మీదనో, వెదుళ్ల పుంత పక్కనో, వంక నడవలోనో నడిచి చూడండి. నడస్తా నడస్తా చెవులను రవంత నిక్కబొడవండి. మనం నడస్తా ఉంటే మయి మాట్లాడతా వస్తుంటాది మనతోనే. తుది లేనన్ని కతలను నుడవతా తోడు నీడయి వెంబడిస్తా ఉంటాది ఆ జాడ.

దోవంత తోడుగత్తె బతుకులో ఇంకేదీ ఉండదేమో! ఊపిరు లాడే మేనుల్నీ మోస్తాది. ఉసురు ఎగిరి పోయిన కట్టెల్నీ మోస్తాది. కట్టె కాలిపొయినాక ఆ కట్టె తలపులనీ మోస్తాది. మోసి మోసి ఆ కట్టెకు కావలసిన వాళ్లు వచ్చినప్పుడు, ఆ తలపులతో వాళ్లను తడపతాది. మా సునందవ్వని తలుచుకొందామని ఆ వూరికి బయలుదేరినాను నేను.

అవ్వా అంటే మా సునందవ్వకి కోపం. మా అమ్మకు చినమ్మ నాకు అవ్వకాక ఇంకేమి అవతాది! మాతట్టు అమ్మమ్మా, నాయనమ్మా అనే పిలుపులు లేకపోయె. మామ్మల్నీ బామ్మల్నీ ఎరగనే ఎరగం. అమ్మ తట్టు వాళ్లనయినా నాయనతట్టు వాళ్లనయినా అవ్వా అని పిలిచేదే మా వాడుక. అట్ట పిలిస్తే గయ్యిమని లేచేది సునందత్త.

''రేయ్, నన్ను అవ్వా అన్నావంటే పీక పిసికేస్తా-మీ అమ్మకన్నా రెండేళ్లే పెద్దదాన్నివాయ్. అత్తా అని పిలువు నన్ను,'' అని అరిచి మరీ అత్తా అని పిలిపించుకొనేది.

సునందత్తవాళ్ల ఊరి పేరు ఈదలకండిగ. పేటనించి ఆ ఊరికి పోవాలంటే, చెంగాళమ్మగుడికాడ ఉండే నెర్రికాలవను దాటాల, చెంగాళమ్మను పలకరించాల, కాళంగేటినీ పాములకాలవనీ రాళ్ల కాలవనీ దాటాల. పులిందర, కొండూరు అనే రెండూళ్లను చూసుకొంటా పోవాల. ఇదంతా చెన్నపట్నానికి పోయే తారుబాట మీదనే. కొండూరును దాటుకొన్నాక తారుబాటకు పడమటతట్టు చీలి ఉంటాది ఒక ఎఱ్ఱగులక బండి బడిమి. ఆ బడిమిన పడి అయిదు మైళ్లు నడిస్తే ఈదలకండిగ మన కంట పడతాది. దారిలో తగిలే పెదమాంబట్టు చినమాంబట్టులను తగిలే పోవాల.

సునందత్త గురించి నాకు తెలిసిన కొద్ది మందలను ఎవురితోనన్నా పంచుకోవాల అనిపించింది. ఇమ్ముదుమ్ముల్నీ ఇడుము కుడుముల్నీ ఇచ్చిపుచ్చుకొనేదానికి దారికన్నా మంచి జతగత్తె లేదన్నాను కదా. అందుకే మొన్న వెండిపన్నాటి (శుక్లపక్ష దశమి)నాడు, నడిరెయ్యికి రవంత ముందు నడకను మొదలుపెట్టినాను. తారుబాట మీద నడిచి నడిచి కొండూరును దాటినాను. ఇంకొక నూరుబారలు నడిస్తే చాలు, ఈ తారుబాటను దిగేసి, ఎఱ్ఱగులక కోకను కప్పుకొనుండే బండిదడము మీద కాలు మోపచ్చు. అక్కడినించీ ఈ చెప్పుల్ని విప్పి

విసిరి కొట్టేయాల. సన్నటి నున్నటి ఎర్రగులక అరికాళ్లకు గుచ్చుకొని సక్కిలిగిలి పెడుతుంటే నడక బలే సాగతాది. ఆ నూరుబారలూ నడిచి చీలుదారి కాడకి పొయినాను. అక్కడికి పోతానే నా కాళ్లు గూటాలు కొట్టుకొన్నట్టు టక్కన నిలబడిపోయినాయి. నా కళ్లు బెప్పరపోతా అట్టా ఇట్టా దేన్నో వెతికినాయి. అక్కడ గులకదారి లేదు. నూరడుగుల వెలుపుతో నల్లంగా నిగనిగలాడతా ఒక తారుబాట వెలిసుండాది.

"హూ ఆర్యూ మేన్, ఎక్కడికెళ్లాలి?" అంటా పలకరించింది ఆ తారుబాట.

"మాంబట్టుకు పోయే దోవ..." నసిగినాను.

"వాట్ మాంబట్, డాటీ విలేజ్. నేను అపాచీకి వెళ్లే హైవేని," చిరపరమనింది అది. నాకు ఏం చెప్పాలో తోచలేదు. ఆ బాటమీద అడుగును మోపాలని అని పించలేదు. దిగులుగా వెనక్కి తిరిగినాను. అరమైలు దవ్వు వెనక్కి నడిచొచ్చి రాళ్లకాలవ వంతెన మీద నిల బడినాను. డొక్కలెండి చిక్కిపోయిన రాళ్లకాలవ పతుల్లో ఉత్తూతిపిట్ట ఒకటి ఏడుపుపాటను పాడతా ఉండాది. కాలవకట్ట మీద ఎండిన గంటాకు గుబురులో కడుపు నిండిన పామొకటి కుసుమును విడస్తా ఉండాది. బోరున కురస్తుండే వెన్నిల్లో తడస్తా అట్నే నిలబడుకోని ఉండాను.

"అబయా, బాగుండావా నాయినా. ఎన్నేళ్లయింది నిన్ను చూసి. ఇట్ట దగ్గిరికి రా కొడుకా," అనే పిలుపు తూము పక్కనించి వినపడింది నాకు. చివక్కన వంగి చూసినాను. చిన్న కాలిదోవ, చెయ్యూపి నన్ను పిలస్తా ఉండాది. చెప్పాలసింది చెప్పి ముగించకుండా అట్టిట్ట పోతుండాడేంది అనుకోబాకండి.

అయినపొయినోళ్లు అందరూ దాటుకొన్నాక, అయిదేళ్లు తాలి, సొంత అమ్మమ్మోళ్ల ఊరికి పొయి నాను. రెండుగంటలసేపు సాగిన ఆ పయనంలో నన్నెరిగి పలకరించిన దిక్కులేకుండా పోయింది. కడాకు ఊరి గమిట్లోకి పొయినాక, చీకిరేనిమాను నీడలో కూచో నుండే చింకికోక ముసిలవ్వ ఎచ్చరించుకొనింది నన్ను, 'అబయా బాగుండావా,' అంటా. ఎవురా అనుకొంటా దగ్గరకి పొయి చూస్తే, మాయవ్వకు తోడుగత్తె అయిన మాలపోలవ్వ. ఒకరి చేతుల్ని ఒకరం పట్టుకొని వలవలా వగచుకొన్నాం ఇద్దరమూ ఆ పొద్దు.

అట్టాంటి దూకోలే దోవమ్మ పిలిచినప్పుడు కూడా కలిగింది. దెబగుబ వంతెనని దిగి దోవ దగ్గరకు పొయి నాను. నున్నటి దువ్వ చేతులతో నా అరికాళ్లను అబ్బి ళించుకొనింది దోవమ్మ. పొగిలి వస్తుండే అలమటను అణుచుకొంటా పక్కనే ఉండిన బొంతరాతి మీద కూచు న్నాను. నా చుట్టూ పరుచుకోనుండే నేలమీదంతా బోడి తరాలు మొలిచుండాయి. మెత్తటి వెన్నెలకు నెత్తావిని అద్దతా ఉండాయి పూచిన బోడితరాలు. తలల్నూపతా నేనెవర్నో అడిగినట్టు ఉండాయి, "సునందమ్మ అని నాకొక తోడగత్తె ఉణింది. ఆయమ్మ మనవడు. మీరెర గరులే," అని చెప్తా ఉండాది దోవమ్మ. అవును వాటికెట్ట తెలస్తాదిలే, బోడితరం బతుకు మూడునాలుగు నెలలే కదా.

"అవా, ఆ మాంబట్టు బండిదడము ఎప్పుడు పొయిందవా, అక్కడ పెద్ద తారు బాట వచ్చేసుండాదే," దోవమ్మని అడిగినాను.

"అయ్యో కొడుకా, ఆమాట ఎందుకు అడగ తావులే. ఆ బడిమి చచ్చిపొయి అయిదేళ్లు దాటిపొ యింది. దానిని చంపేసినోళ్లే అక్కడ ఆ తారుబాటను తెచ్చిపెట్టినారు. బాటా బడిమీ అంటే దానికి బలే కోప మొస్తాది అబయో, నిపర్తముండగానీ. దాన్ని అప్పాచి ఐవే అనాలంట. అప్పాచి అని మాంబట్టు దగ్గిర ఒక నను పిల్లును కట్టుండార్లే. ఒక్క ఆ దడమే కాదు కొడుకా, ఇప్పుడిక్కడ బండి బడిమిల్లేవు, కయ్యల్లోకి నడిచే కాలి దోవల్లేవు, కడుపుతొందరను దించుకొనేదానికి పొయే వంకపుంతల్లేవు, గొర్రెలు గొరుసులు మేపులకు కదిలే ఓణుల్లేవు, గొడ్డూగోదలు కాలు సాగించే కంతుల్లేవు, చచ్చిన పీనిగని ఏగించేదానికి చొప్పుల్లేవు. ఇప్పుడేముం డాది అబయా ఈడ, అంతా ఒలికిలి కదా ఇది. మణు సులు లేక మరలు మటుకే తిరుగులాడే ఒలుకుల మిట్ట ఇదంతా. నీబోటోళ్లు ఎవురయినా వస్తారనే ఆబతో నాబోటి ఒకటి రెండు దోవలు ఊపిరితో నిలిచి వుండాయి ఇంకా. మేముగూడా ఇంక ఏళ్లకేళ్లు వుండ బోము, నాళ్లో నెలలో అంతే," నిట్టూరస్తా చెప్పింది దోవమ్మ.

అవ్వ మాటల్ని విని ఉలుకూపలుకూ లేకుండా అయిపొయినాను. అవ్వే మళ్లా నోరిప్పింది. "అబయా లెయి నాయినా. సునందమ్మ మాటల్ని చెప్పుకొంటా ఆడదాకా కాలు సాగించి వద్దాం పా," అంటా నన్ను లేపింది. నేను లేచి ముందుకు అడుగు లేసినాను.

"ఎంత చక్కనిదబయా మీ సునందత్త. అట్టాంటి అందగత్తెని ఈ పాయకట్టు లోని పదిపన్నెండు పల్లెల్లో నేనెరగను," అంటా సునందత్త కతను అందుకొనింది దోవమ్మ.

''అవును, నాకు పదిపన్నెండేళ్ల ఈడు వరకూ చూసుంటాను సునందత్తని. అప్పుడు అత్తకు ఈడు నలభై లోపల్నే ఉండుంటాది. ఎట్టాంటి అందం సునందత్తది, అప్పుడే ఒలిచిపెట్టిన అరిటిబొందు మీద నీరెండ పడి మెరస్తుంటే ఎట్టుంటాది, అట్టుండేది అత్త ఒళ్లు. వక్కాకు వేసే వాడిక లేదు అత్తకు, అయినా ఆ పెదాలు గురిగింజ నిరుపుతో నిగనిగలాడతా ఉండేయి,'' అత్తను తలుచుకొంటా అన్నాను నేను.

''ఆ సొగుసే కదా అబయా, ఆయమ్మకు నుగ్గింపు అయిందీ. ఆ సొగుసే కదా ఆయమ్మ బతుకుని ఎండగట్టేసిందీ. ఈదలకండిగ ముద్దురెడ్డికి ఇల్లాలయి, పదేడేళ్ల ఈడులో తొలిసూరి నామీద అడుగులు పెట్టింది సునందమ్మ. అప్పటినించీ కడాదాకా నాతోడును విడవలేదు. అలమటల్నీ అంగలార్పుల్నే కాదు చెలగింతల్నీ చెంగలింతల్నీ కూడా నాతోనే పంచుకొనేది,'' అనింది దోవమ్మ.

''అయినా కానీ సునందత్త ఎంత పొగురుగా ఉండేది! అంత పొగురెందుకో నేనెరగను. ఊర్లోవాళ్లు కొందరు అత్తకు వినిపించేటట్టే, 'యిడిసిన లంజ, యిరేసుకోని తిరగతుండాది చూడు, నడ్డి బరిగొడ్డు,' అని గొణగతుండేవాళ్లు. ఎవరి మాటల్నీ లెక్క చెయ్యకుండా మగరాయుడు నడిచినట్టు నడిచిపోతుండేది. పైగా ముచ్చిలితనం అనే ఒక చెడ్డ ఎసలు ఉండేది. ఒకనాడు ఏమయిందో తెలుసా. నాకప్పుడు ఏడో ఎనిమిదో వుండుంటాయి ఏళ్లు. బలబల తెల్లారక ముందే లేచి, బయట తొట్టికాడకి పొయి మూతి కడుక్కొంటా వుండాను. ముందింటి గేణమ్మ ఎవురిమీదనో గొంతు చించుకొంటా ఉండాది.

''ఏ నా సవితో మూడు దాదినిమ్మకాయల్నీ మట్టగించేసిందమ్మా. కంకెడు కంకెడు కాయలు ఎర్రంగా తేరి యేలాడతా ఉండినాయి. రేపో ఎల్లుండో పేటనించి నా మనవడు వస్తాడని, వాడి కోసరం కొయ్యకుండా చెట్టుకే పెట్టినాను. చిలకేడ కొట్టేస్తాదో ఉడతేడ కొరికేస్తాదో అని గుడ్డలు చుట్టిపెట్టి కళ్లల్లో ఒత్తులేసుకొని కాపాడినాను. రేత్రికే రేత్రే కోసుకోని పొయినారే, ఒక్క కాయనయినా పెట్టిపెట్టుండకూడదా. వీళ్లను పాము పెరకా, వీళ్లకు వాతీబేదీ రానూ... కడిగిపోస్తా ఉండాది గేణమ్మ.

''రెయ్యి ఒక పొద్దులో తూగుకళ్లతోనే అత్త తినిపిస్తా ఉంటే దానిమ్మగింజల్ని తినినట్టు లీలగా గురుతొస్తా ఉండాది. పరిగిస్తా ఇంట్లోకి పొయినాను. నిట్టాడి పక్కన కూచోని అంబలి కలపతా ఉండాది అత్త. నన్ను చూసి నవ్వతా, 'రా బంగారా అంబలి తాగుదువు' అని పిలిచింది. నేను అత్త పక్కన కూచోని, 'అత్తా అత్తా గేణమ్మ ఎవుర్నో తిడతా ఉండాదత్తా,' అన్నాను.

''దానికేమీ పంగలేదు, ఎప్పుడూ ఎవుర్నో ఒకర్ని ఆడిపోసుకొంటానే ఉంటాది. ఆ మాటల్ని నువ్వు పట్టించుకోబాక. అట్టాంటి మాటల్ని చెవలకు కట్టుకొంటాపోతే బతికి బట్టగట్టలేము. నువ్వు అంబలి తాగు. ఈపొద్దు మనం మన బరిగొడ్డుని దామరగుంట కాడకి తోలుకొని పోదాం. నీకు మంచి మంచి దామరగడ్డల్ని పెరికిస్తా, తిందువు,' అంటా లేచి బయటకు పొయి, చెయ్యి కడుక్కొని వచ్చి, 'బంగారా, రేతిరి దాదినిమ్మగింజల్ని తినిన మందలను ఎవురితోనన్నా అనేవు, ఏమీ ఎరగనట్టు ఉండిపోవాల, సరేనా,' అనింది. నాకు నవ్వాల్నో ఏడవాల్నో కూడా తెలవలేదు అత్త మాటలకి,'' చెప్పుకొన్నాను ఆనాటి చవిగోలును ఒకదానిని దోవమ్మతో.

''అబయా, ఈ కత నాకు గూడా తెలుసు. మీ అత్తే చెప్పిందొకతూరి. అప్పుడు ఆ గేణమ్మవాళ్లకి నాలుగుమూటల నువ్వులు పండి ఉండినాయంట. నువ్వొస్తుండావని తెలిసి, నీకు చిమ్మిరి చేసి పెడదామనుకొని, దోసిడు నువ్వుల్ని అడిగిందంట మీ అత్త. గేణమ్మ మూతిని మూడువంకర్లు తిప్పి సింగిలించుకొంటా లేవని చెప్పేసిందంట. అందుకే మూడోనాడు నడిరెయ్యిలో యెలుగును తొక్కుకోని పొయి, ఒక్కటి కూడా మిగల్చకుండా మూడు దాదినిమ్మకాయల్నీ కోసుకొనొచ్చేసింది మీ అత్త,'' దోవమ్మ పకపకమంటా పంచుకొనింది నాతో. నాకూ నవ్వొచ్చి కిసుక్కుమన్నాను.

''అది సరేగానీ అబయా. అప్పుడొకతూరి కాళాస్తిరికి పొయినారంటనే మీ అత్తా నువ్వా కలిసి, ఆడ కూటింట్లో ఏదో గలాట అయిందంట కదా. మీ అత్త చెప్పిందిలే. అయినా ఇంకొకతూరి నీ నోటితో చెప్పబయా, వినాలని ఉండాది,'' ఉవ్వాయిగా అడిగింది దోవమ్మ.

ముసిముసి నగవుల నడుమ ఆ కతను ఎత్తుకొన్నాను. ''ఆ మందల దేనికి అడగతావులే వా. ఒకనాడు మాపటేళ గప్పరగప్పర చీకట్లు ముసురుకొంటా ఉండే పొద్దులో, కాళాస్తిరిలో దిగినాము మేము. గుడికాడకి పొయేతరికి మింట చుక్కలు పుట్టేసుండాయి. ఆ రెయ్యి గుళ్లోనే నూరుగాళ్ల మండపంలో పణుకొన్నాము. తెల్లారి సుక్కపొద్దుకే లేపేసింది నన్ను. ఆ చల్లోనే ఏట్లోకి పొయి

మునిగినాము. నీళ్లలోకి దిగితే అత్తకు ఒళ్లూ కళ్లూ తెల వదు కదా. రా అత్తా, మునిగింది సాలు పోదాం అంటే వింటేకదా. నా వీపును రుద్దిరుద్ది కడిగింది. కుంకాసి గుల్లను ఎత్తి నా చేతికిచ్చి, దాంతో ఆమె వీపుని గీరమ నింది. కుంకాసిగుల్లతో గీరి, చేతులతో రుద్దతుంటే, అత్త వీపు మీద మట్టి రేడులు రేడులుగా రేగింది.

"చుక్కపుట్టక ముందు ఏట్లోకి దిగిన మేము, మా మునకలు తీర్చుకొని రేవు పడికట్లను ఎక్కేతరికి పొద్దు పుట్టేసుండాది. గబగబ పొడిగుడ్డల్ని కట్టుకొని, తడి గుడ్డల్ని పిండి సంచిలో దురుక్కొని, గుళ్లోకి పొయి నాము. ఇప్పటి మాదిరిగా అప్పుడు గుళ్లల్లో ఇంతంత గుంపు ఎక్కడుణ్ణిందా. నోట్లో వక్క నాని నలిగే అంత లోపల్నే శివుడికీ గేణమ్మకీ దండాలు పెట్టేసి, అంత గుడినీ చుట్టుకొని బయట పడిపొయినాము. నూరుగాళ్ల మండపం కాడ తడిగుడ్డల్ని విప్పి ఆరబెట్టుకొన్నాము. నాకు కడుపులో కుక్కలు లొలొమన్నాయి.

"అత్తా ఆకలవతుండాదత్తా అన్నాను. ఆ మాటతో ఆరీఆరని గుడ్డల్ని మళ్లా సంచిలో దురిగి, 'పద బంగారా, కూటింట్లో ఇడ్లీలో దోసెలో తిని బయదేలదాం,' అంటా కదిలింది. చిన్న గాలిగోపురానికి ఎదురుగా ఉండే తెరువు లోని ఒక కూటింట్లోకి దూరినాము. ఆలెకాడు ఉడుకు డుగ్గా అందిస్తా ఉంటే రెండు రెండు ఇడ్లీలు, ఒక్కొక్క మసాలదోసె, ఒక్కొక్క కాపీ కమ్మంగా ఇద్దరి కడుపుల్లోకీ దూరేసినాయి. ఆలెకాడు మా ముందు పెట్టిన కిల్లాకుని చూసి నాకు గుండె గుబిక్కుమనింది. ఇద్దరం కలిసి ఇరవై రూపాయలకి తినేసినాము.

"అత్తమటుకు ఏమీ పట్టనట్టు కిల్లాకును ఎత్తు కొని, నా దగ్గర ఇచ్చిపెట్టుండే డబ్బుల్లోనించి ఇరవై రూపాయలు తీసుకొనిపొయి, గల్లాబల్లమీద పెట్టింది. అక్కడుండే ఆయన ఆ డబ్బుల్ని గల్లాలో వేసుకొన్నాడు. ఇంక మేము అడుగు బయట పెట్టబోతాము అనంగా లబలబలాడతా మా దగ్గరకొచ్చి మమ్మల్ని నిలేసినాడు ఆలెకాడు.

"మోవ్ మరియాదగా నువ్వెత్తుకోనుండే లోటాల్ని అక్కడ పెట్టు, అంటా ఉండాడు అతను. నేను బెప్పర పొయి నిలబడుకోనుండాను. మా అత్త ఆయన్ని కొట్టే దానికి పైపైకి పోతా ఉండాది. మంది చుట్టూ గుమి గూడి పొయినారు. ఆలెకాడు అరిచి పిలిచేసరికి లోప ల్నించి పనిగత్తె ఒకామె పరిగిస్తా వచ్చింది.

"మునెమ్మా, ఆయమ్మ కోకలో రెండు లోటాల్ని దాపెట్టేసుండాది. అడగతుంటే ఆగిత్తం చేస్తుండాది. ఆ కోక కుచ్చిళ్లను యిదలగొట్టు పో, అన్నాడతను. ఆ మాటతో నాకు చెమటలు కారిపొయి, గుండె దడదడ కొట్టుకొంటా ఉండాది. అత్తని వాళ్లేమన్నా చేస్తే నేనెట్ట అడ్డంపొయ్యేదో తెలవలేదు. బిత్తరంతా నాకేగానీ అత్తకు ఉంటే కదా. పిల్లలపంది మాదిరిగా తిరగబడింది.

"య్యోవ్, ఒళ్లు బద్దరం. ఈదలకండిగ సునం దమ్మ అంటే ఏమనుకోనుండావో, జొన్నల్ని దంచిన చేతు లియ్యి. మా పేటలో చెల్లమ్మ అంగటికి పోతే రూపా యికి పది ఇడ్లీలు. రెండు రూపాయలకి తినేసినామంటే ఇంక మద్దినేళ కూడు తినబళ్లే. ఈ ముండ మోపి ఇడ్లీలకీ దోసిలకీ ఇరవై రూపాయలు తీసుకొన్నారే. మా కడుపులు కొట్టి మీరేమి బాగుపడతారా. మట్టికొట్టుకుపోతాది మీ కూటిల్లు. ఇందా మీ ముదరష్టపు లోటాలు, అంటా బొడ్లో దోపుకోనుండే రెండు లోటాలనూ తీసి విసురుగా విసిరేసి, 'రా బంగారా పోదాం,' అంటా యెలవరపొయి నిలబడుకోనుండే నన్ను లాక్కొని వచ్చేసింది."

పడిపడి నవ్వతుండే దోవమ్మతో, "అవా, విను, అప్పుడే అయిపోలేదు కాళాస్తిరి కత. మేమిద్దరమూ సర సర నడుచుకొంటా పెళ్లిమండపం కాడకి చేరుకొన్నాము. అక్కడ నిలబడి ఊపిరి తీసుకొనింది. 'ముండనాబట్ట, బంగారంలాంటి లోటాల్ని లాగేసుకొన్నాడు. ఈ సునం దమ్మ అంటే ఏందో తెలవలేదు వాడికి. లోటాలు మటుకే అనుకొన్నాడు,' అంటా ఇంకొక పక్క కోకలో నించి రెండు సాంబారు గిన్నెల్ని బయటికి తీసి చూపిం చింది నాకు. అప్పటివరకూ ఉండిన బిత్తరా కోపమూ రెండూ ఎగిరిపొయి, ఇద్దో ఇప్పుడు నువ్వు నవ్వతుండావే అట్నే నవ్వినాను నేను కూడా ఆ పొద్దు," అని కాళాస్తిరి కతను ముగించినాను.

మా మాటల్లోనే కళ్లు జిగేలుమనిపించే వెలుతు రొచ్చి నా కళ్లను గుచ్చింది. నేను చివక్కన కళ్లకు చేతిని అడ్డం పెట్టుకొన్నాను.

"అదే అబయా అప్పాచి ననుపిల్లు. రెయ్యికీ పగటికీ వారా ఉండదు ఆడ. వెన్నిలే వెలవెలపొయే వెలుతురది. మనబోటి వాళ్లని అడుగుకూడా పెట్టనీరు ఆతట్టుకి. వాళ్లు పెట్టనిచ్చినా ఆ గబ్బుతావు మనకొద్దు. మనము ఈ కాలవ ఓరన్నే పోదాం రా," అంటా వెలు తురుకు ఎడంగా నన్ను తీసుకొనిపొయింది దోవమ్మ.

"మనం పెదమాంబట్టు లోపలకు పోమా వా," అడిగినాను.

"దేనికబయా, ఏముండాదని ఆడ. పేరుకే ఇప్ప డది పల్లె. పేటకన్నా మించి పొయుండాది. పనిపాటులు

ఎరగక మణుసులంతా మరలయి పొయుండారు,'' చెప్పింది దోవమ్మ.

''అది కాదువా. వనవ్వది ఈ ఊరే కదా. వాళ్లింటిని ఒకతూరి చూసిపోదామని...'' నసిగినాను.

''కొడుకా, నాకు తెలవదా నీ ఆబ. కూతురి ఇమ్ముకోసరం తన నెమ్మిని వదులుకొన్న తల్లి మీ వనవ్వ. తన మాదిరిగా ఇడుములు పడకూడదని, పెద్ద జీతం తెచ్చుకొనే తక్కువ కులపాయనకు కూతుర్నిచ్చి కట్టబెట్టి, ఊరందరి దగ్గరా ఉయిపించుకొనింది. వనవ్వ కతను చెప్పేవాళ్లు ఎవురో ఒకరు ఎక్కడో ఒక దగ్గిర దొరకతారు. ఇప్పుడు పొద్దు చాలదు, పోదాం పద నాయినా,'' అంటా ముందుకు సాగింది.

ఇంకొక రెండుమైళ్లు కూడా ఉండదు ఈదల కండిగ. పోతా పోతా ఒక దగ్గిర ఆగినాను. ''ఏం నాయినా నిలబడినావా?'' అడిగింది దోవమ్మ.

''ఇక్కడెక్కడో ఒక దామరగుంట ఉండాలవా. నేనూ సునందత్తా బర్రిని తోలుకొని వచ్చేవాళ్లం. అత్త నాకు దామరగడ్డల్ని పెరికి ఇచ్చేది. నేను గడ్డల్ని తింటా ఉంటే అత్త పాంచాలమ్మ దాయాలాట పాటని పాడతా ఉండేది. దరమరాజు, పాంచాలమ్మని దాయాలాటలో ఒడ్డి ఓడిపోయేదీ, దుశ్శాసనుడు పాంచాలమ్మను ఈడుచుకొని రావడానికి పోతే, నేనే వస్తుండాను పదా అంటా పాంచాలమ్మ పేరోలగానికి వచ్చేదీ, నా మొగుడితో ఆడి గెలిచేది కాదురా, నువ్వు మొగోడివయితే నాతో ఆడి గెలువని దురియోదనుడ్ని డీకొట్టేది. శకుని చేత్తో దాయాల్ని విసిరితే, పాంచాలమ్మ కాలితోనే తోసేదీ, తొలి ఆటకు మొగుళ్లనీ మలాటకు రాజ్యాన్నీ గెలుచుకొని దురియోదనుడి మొకాన కేకరించి ఊసేసి పొయ్యేదీ... ఇట్ట సాగతుంటాది ఆపాట. ఎప్పుడు చూసినా అదొక్కటే పాట. అయినా ఎంత బాగుండేదో,'' పాత గురుతుల్ని రేపుకొంటా అన్నాను.

''అవునబయా, నీకు అన్నీ గురుతుండాయి. ఇంకొక పదిబారలు పొయినాక వస్తాదిలే దామరగుంట. సునందమ్మ పాడుకొనే పాట ఒకటే తెలుసు నీకు. నా దగ్గిర కూడా పాడేది అదే పాటను. పాట అయిపొయినాక, 'పాంచాలమ్మ తనకు కర్ణుడు కావాలని అడిగిందంట కిష్టయ్య చెవులో. అడిగేదేదో దుర్యోదనుడే కావాలని అడిగేసుంటే పొయుండేది. ఆ పీడబతుకన్నా తప్పిపొయుంటాది,' అనేది నాతో. పాంచాలమ్మ బతుకు మాదిర బతుకే కదా సునందమ్మది కూడా,'' దోవమ్మ చెప్తా ఉండంగానే ఆ పక్కనే సన్నగొంతుతో ఎవురో ఏడస్తుండే సద్దు వినపడింది. గబగబ నడిచినాను ముందుకు. నాకంటే ముందే ఉండాది దోవమ్మ.

పదడుగులు ముందుకు పొయినాక, అక్కడొకామె చింకిపాతల్ని చుట్టుకొని, చీకేసిన తాటిముట్టి మాదిరిగా రేగిన జుట్టుతో కూచుని ఏడుసుకొంటా వుండాది.

''పుంతమ్మీ లెయి లెయి, ఏడవబాక, ఎవురొచ్చినారో చూడు,'' అనింది ఆమెతో దోవమ్మ. ఆమె తలెత్తి నా కళ్లల్లోకి గుచ్చిగుచ్చి చూసింది.

''అమ్మీ, గురుతు పట్టలా. మన సునందమ్మ మనవడు,'' అంటా నన్ను నెళవు చేసింది దోవమ్మ. ఆరిపోబోతుండే దీపానికి నూనె తగిలినట్టు వెలిగింది ఆమె మొకం.

''రా అబయా రా, నీ కోసరమే కాసుకోనుండా,'' అనింది ఎలుగెత్తి ఆమె.

''అబయా, నేను ఇక్కడ్నే ఉంటా. ఇది పుంతమ్మి, నిన్ను దామరగుంటకాడకి తొడకోని పొయి చూపిస్తాది పో. ఆయమ్మి ఏం చెప్పినా ఎదురడగకుండా వినేసి రా. బిన్నా పంపించు పుంతమ్మీ,'' అనింది దోవమ్మ మా ఇద్దరితో.

పుంతమ్మ అడుగుల్లో అడుగులు పెడతా దోవకు కొంచెం ఎడంగా చీలి లోపలకు పొయినాను. నూరు బారలు పొయి అక్కడ నిలబడింది పుంతమ్మ.

''అదేనబయా దామరగుంట. ఆ గుంటలోని గడ్డల్నే మీ సునందవ్వ లోడిస్తే నువ్వు తింటా ఉణింది,'' అంటా చెయ్యిచాపి ఒక తట్టుకు చూపించింది పుంతమ్మ.

అక్కడ గుంట ఉండిన ఆనవాళ్లు కూడా లేవు. నేనేమీ అచ్చెరపోలేదు కానీ చెప్పలేనంత వేసట కలిగింది.

''అదిగో ఇడవలి నీడకు కూడా నోచుకోని ఆ బరిబండల మీద రవంతసేపు కూచో అబయా. ఒకప్పుడు అక్కడుండిన కానగమాను నీడలోనే నువ్వు కూచుంటా ఉణింది. ఆ పక్కనే ఉండిన మోదగ గుబుర్లో ఆకులు తుంచుకొంటానో, ఈ పక్కన చవిటిపర్రలో మొలిచిన చీకరపుల్లల్ని గిల్లుకొంటానో పాంచాలమ్మ పాటను నీకు వినిపిస్తుండేది మీ సునందత్త. అద్దో అక్కడ దామరగుంట అంచున పెరిగిన గరిక్కసువుని పరపర మేస్తా ఉండేది మీ పల్లబర్రి. మోదగ గుబురుకు ఆపక్క గంటాకు పొదలు పొదలుగా ఎదిగుండేది గురుతుండాదా. నేను ఎప్పటికీ ఆ గంటాకు పొదల్ని మరిచి పోలేనబయా.

''దామరగుంటకు ఆతట్టు పాలసవిటి మిగ్రు వుండేది. ఇప్పుడూ ఉండాదిలే. ఆ మిగ్రుమీద ఉండిన మర్రిమాను మటుకు లేదిప్పుడు. ఆ మర్రిమానే కదా నాలుగూళ్ల మొగోళ్లు చీట్లాడేదానికి నీడనిచ్చింది. అదిగాన ఉండుంటే, దాని నీడన ఎన్ని కొంపలు గుల్లయిపోయిందీ, ఎన్ని కాపరాలు కడతేరి పాయిందీ కతలు కతలుగా చెప్పుండును. మేలు చేసుకొన్న తల్లి, బిరాన కాలం కడుపులో కరిగిపోయింది.

''ఆ మాను కిందనే మీ సునందత్త మొగుడయిన ముద్దురెడ్డి, చీట్లాటలో ఆయనకుండిన అయిదెకరాల మడికయ్యను పోగొట్టుకొన్నాడు. కయ్యను గెలుచుకో వాలన్న ఆబలో కడకు ఆలినే పందెంగా ఒడ్డినాడు. కయ్యను గెలుచుకొన్న మునిరామనాయుడు, సునం దమ్మను కూడా గెలుచుకొన్నాడు. అన్నెనక ఊర్లో ఏమి జరిగిందో నేనెరగను. పదినాళ్లు తాలినాక ఒక మిట్ట మద్దినేళ జరిగింది ఆ ఒగ్గాళం. ఒంటిగా ఉండిన సునం దమ్మ మీద పడినాడు మునిరామనాయుడు. సునం దమ్మ లబలబ నోరుకొట్టుకొనింది, ఎలుగెత్తి అరిచింది, 'అన్నా నీ తోడబుట్టునన్నా, నన్ను వదిలెయ్యన్నా,' అని నాయుడి కాళ్లను పట్టుకొనింది. సునందమ్మ జుట్టు పట్టుకొని ఈడుచుకొంటా పొయి గంటాకు పొదల్లోకి దూరినాడు నాయుడు.

నాయుడు లేసిపొయిన చానాసేపటి వరకూ పొదల నడాన్నే పడి ఉండిపొయింది సునందమ్మ. అన్నెనక ఎట్నో తెప్పరిల్లి లేసింది. దామరగుంటలోకి పొయి మునిగేసి వచ్చి, కానగమాను నీడలో కూచుని గుక్కబట్టి ఏడిచింది. ఏడిచి ఏడిచి సొరిగిపొయింది. అట్నే పణుకొని చానాసేపటికి మళ్లా లేసింది. ముని ముని చీకట్లు ముసురుకొనే పొద్దుకు బర్రిని తోలుకొని ఇంటి తట్టుకు అడుగులు వేసుకొంటా నెమ్మదిగా కదిలి పొయింది. నా కళ్లెదురుగా జరిగిన ఈ పాడునడితిని నీకు చెప్పేదానికే ఇంకా ఉండాను నాయినా,'' అంగ లారస్తా చెప్పింది పుంతమ్మ.

సునందత్త గురించి ఇప్పటివరకూ నాకు తెలవని మందల ఇది. లోపలెవరో చెయ్యిపెట్టి కెలికినట్టుగా అనిపించింది.

''అబయా రా నాయినా, సుక్కపుట్టే పొద్దుకు ముందే తిరిగి తారుబాటకాడకి పోవాలగదా,'' దోవమ్మ గొంతు వినిపించింది. పుంతమ్మ తట్టుకు చూసినాను. పొయిరా అన్నట్టుగా చెయ్యూపింది. మళ్లా దోవన పడినాను.

''అబయా, మీ సునందత్త పసిబిడ్డ మాదిరిగా నీతో ఆట్లాడతా ఉణింది మటుకే తెలుసు నీకు. ఆయమ్మ గురించి నీకు తెలవనిది చానా ఉండాది, చెప్తాను వింటా రా,'' అంటా అత్త కతను అందుకొనింది దోవమ్మ.

''సునందమ్మ ఈ ఊరిని మెట్టి వచ్చేటప్పటికి, మొగుడయిన ముద్దురెడ్డికి అయిదెకరాల మాగాణీ ఎకరం మెట్ట ఉండినాయి. మట్టసమయిన రెండు దూలాల పట్టు ఇల్లు వాళ్లది. సునందమ్మ అందానికి ఈ ఊరి మొగోళ్లు బెప్పరపొయినారు. ముద్దురెడ్డిని చూసి కుళ్లుకొని సచ్చేవాళ్లు. కొందురయితే ఎట్టయినా ఆయమ్మను పొందాలని తపన పడిపొయినారు. వాళ్లల్లో మునిరామనాయుడు కూడా ఒకడు. నిలవలేక సునం దమ్మ ఒంటిగా ఉన్నెపుడు అడిగేసి మొకాన ఉయి పించుకొన్నాడు.

''వాడే ముద్దురెడ్డికి చీట్లాటను వాడిక చేసినాడు. చీట్లాట ఆడి ఆడి దానికి అడిమ అయిపొయినాడు ముద్దురెడ్డి. ఒకనాడు దామరగుంటకు అవతలుండే మర్రిమాను కింద జరిగిన చీట్లాటలో తన అయిదెకరాల మడికయ్యను ఓడిపొయినాడు ముద్దురెడ్డి. గెలిచినోడు మునిరామనాయుడు. చుట్టూ ఉండేవాళ్లు రెచ్చకొడతా వుంటే, కడాన సునందమ్మని కూడా ఒడ్డి ఓడిపొయి నాడు. 'మూడు రేత్రిళ్లు నాతో ఉంటే చాలు, ఆనేక నీ పెళ్లామూ వద్దు, నీ కయ్యా వద్దు,' అనేసినాడు ముని రామనాయుడు.

''ఇది జరిగినప్పటికి మీ అత్తకు కొడుకు పుట్టి, రెండేళ్ల ఈడులో ఉండాడు. ఆ రెయ్యి ముద్దురెడ్డి ఇంట్లో ఉండంగానే, ఊరు కునికేసి నాక, మునిరామ నాయుడు సునందమ్మ కోసరం పొయినాడు. ఇదంతా తెలవని సునందమ్మ, కొడుకుమీద పైటకొంగుని కప్పి పక్కనే పణుకొని నట్టింట్లో కునకతా ఉండాది.

''ముద్దురెడ్డి మెల్లింగా లేసి కొడుకును ఎత్తుకొని బయటకు పొయినాడు. నాయుడు లోపలకు దూరి నాడు. పైనపడిన నాయుడిని ఉలిక్కిపడిలేసిన సునం దమ్మ పట్టి బలంతాన పక్కకు తోసేసింది. మూలనుండే మొచ్చుకత్తిని చేతపట్టుకొని తిరగబడింది. 'రేయ్ నాయుడా, చీకట్లో వస్తే నువ్వెవురో ఎరగననుకొంటా ఉండావా, ఒకే యేటుకు నరికేస్తా, బయిటికి నడువు కుక్కా,' అని అరిసింది. నాయుడు కొరకొరమంటా యెల్లిపొయినాడు.

''కొడుకుని పందిట్లో పండేసి వచ్చిన ముద్దురెడ్డి పెళ్లాంమీద గయ్యిమన్నాడు. 'ఏమే, నాయుడి పక్కన

పణుకొంటే అరిగిపోతావా కరిగిపోతావా, మూడు రేత్రిళ్లు గమ్మునుంటే మన మడికయ్య మళ్లా మనదవ తాదే, లేకపోతే కూటిగింజలకు కూడా అల్లాడాల్నే,' అన్నాడు. 'ఛూ నా బట్టా, నువ్వొక మొగుడివీ మొగోడివీ. చీట్లాటలో ఎవురన్నా పెళ్లాన్ని ఒడ్డతారా? దిగవింటి మణెమ్మ అంటుంటే ఏందోలే అనుకొన్నా. ఆలిగా వచ్చిన ఆడదంటే ఏమనుకోనుండావా? నీ పక్కన పణు కొని నీతో కాపరం చేసేదానికీ మా అమ్మా అబ్బా నీకిచ్చి కట్టబెట్టింది. ఊరోళ్లందరికీ కాపరం చెయిడానికి కాదు. నా జోలికి వచ్చినోళ్లని ఒక్కేటుకి నరకతా, అది ముని రామనాయుడయినా సరే, మొగుడయినా సరే,' అరిసి చెప్పింది సునందమ్మ.

"అన్నెనక పదినాళ్లకు దామరగుంటకాడ ఉండే గంటాకు పొదల్లో సునందమ్మని రంపుచేసి చెరిచినాడు మునిరామనాయుడు. ఇది ముద్దురెడ్డికి తెలిసే జరిగింది.

"ఆపొద్దు గువ్వలు గూళ్లకుమళ్లే పొద్దుదాకా దామరగుంటకాడనే కుమలతా ఉండిపోయింది సునం దమ్మ. అన్నెనక లేసి బర్రిని తోలుకొని గప్పరగప్పర చీకట్లో ఇంటికొచ్చింది. బర్రిని గూటానికి కట్టేసి, దాని ముందు బొక్కడు ఎండుకసు వేసింది. దాని వీపుని నిమిరింది.

"ఇంట్లోకి వచ్చి రెండేళ్ల కొడుకుని ఎత్తి సంకనేసు కొని బయిదేలింది. 'అమ్మా సునందమ్మా, బిడ్డని ఏడకు ఎత్తుకొని పోతుండావా?' ఏమయినా చేసుకొనేస్తాదేమో అని తొప్పరపడతా అడిగినాను నేను. 'దోవక్కా, ఏమీ తొట్రపడబాక. నేనేమీ కాను, వీడినేమీ చెయ్యను. వీడు ఇంక ఈయింట్లో పెరగకూడదు. వీడిని చేర్చాల్సిన చోటుకి చేర్చేసి తెల్లారేటప్పటికి వచ్చేస్తా,' అనేసి విరవిరగా పొయింది.

"ఇక్కడికి తూరుపున ఉప్పుకయ్య అంచునుండే కారిజాతలో నీకు ఇంకొక అవ్వ ఉండేది కదా. సునం దమ్మకు అక్క అవతాది. ఆ ఇంటికి చేర్చింది కొడుకుని. అక్కతో అంతా చెప్పుకొనింది. 'అకా, ఇంక వీడు నా కొడుకు కాదు. నేను కన్నాను అంతే. వీడిని కొడుకుగా సాకి సదివించుకొంటావో, కడుపుకూటోడు అనుకొని గొడ్లని మేపించుకొంటావో, నడి సంతలో నిలబెట్టి అమ్ముకొంటావో... నీకు నచ్చింది చెయ్యి. నేను చచ్చినాక వచ్చి, ఆ వూర్లో ఎకరా మిట్టచేను ఉండాదే, దానిని అమ్ముకోమని చెప్పు,' అనేసిందంట అక్కతో.

"తిరిగి తెల్లారేటప్పటికి ఊరికి వచ్చేసింది. వస్తా వస్తా మాదిగిళ్లకాడకి పొయి పెద్దోడినడిగి పలకను తీసుకొనొచ్చి, తెల్లవారి అంబళ్ల పొద్దులో రచ్చకాడ, డమడమడమ పలకను కొడతా నిలబడింది. ఊర్లోని రెడ్లూ నాయుళ్లూ ఆడా మగా అందరూ రచ్చ కాడకు వచ్చి గుమికూడినారు. అందరూ వచ్చినాక పలకను నిలిపి గొంతెత్తింది. ముందునాడు మునిరామ నాయుడు చేసిన రంపును నలగరి ముందూ విప్పింది. అంతకు పదినాళ్ల ముందు జరిగిన మందలను చెప్పింది. అందరూ నోళ్లు తెరుచుకొని వింటా ఉండారు.

"కడాన ఈ మాటలను కూడా అనింది. 'ఊర్లో ఉండే పినపెద్దలంతా బాగా వినండి. నిన్నటితో ఈ ముద్దురెడ్డికి మొగుడితనం పొయింది. వాడికీ నాకూ ఏ పొంతూ లేదింక. ఈ పొద్దట్నించీ నేను ముండమోపిని. మొగుడు చచ్చినదానిని. ఆ అయిదెకరాల మడికయ్య ముద్దురెడ్డిదో మునిరామనాయుడిదో నాకు పళ్లేదు. నా అమ్మా అబ్బా పసుపుకుంకమ కింద ఇచ్చిన దుడ్లతో కొనిన మిట్టచేనది. దాని జోలికి ఎవురన్నా వస్తే ఊరు కొనేది లేదు. ఆ ఇల్లు కూడా నాదే. బయట ఏడా బతక లేను అనుకొంటే నా పందిట్లో కావిలికుక్క మాదిర పడుండమని చెప్పండి. కుక్కకు వేసినట్టే పూటకు పిడచడు కవళం పారేస్తా. తల్లుల్లారా, ఇంక మీ ఇళ్లల్లో జరిగే పెళ్లిళ్లకీ సమర్తలకీ నన్ను పిలవబాకండి. నేనిప్పుడు ముండరాలిని. ఏయమ్మనైనా ముండమోపీయాల అను కొన్నప్పుడు పిలవండి వస్తాను,' అంటా నలగరి ముందూ గాజుల్ని పగలకొట్టేసి, రయికను విప్పి ముద్దురెడ్డి మొకాన కొట్టేసి పెద్ద పెద్ద అంగలేసుకొంటా ఇంట్లోకి పొయేసింది. ఊరు ఊరే బిత్తరపొయింది, సునందమ్మ మాటలకి. నలుగురూ ముద్దురెడ్డినీ, నాయుడినీ కేక రించి ఊసేసి పొయినారు. ఆ మూడోనాడే నాయుడు, పేటకు కాపరం యెల్నాడు, ఊర్లో తలెత్తుకొని తిరగ లేక," నిలిపింది దోవమ్మ.

"ఊరేందివా, వింటుండే నాకే బిత్తర పుడతుం డాది. మొగుడు చచ్చిపొయినాకనే రయికను తీసేసింది సునందవ్వ అనుకొన్నాను నేను. ఈ కతంతా నాకు తెల వదు కదా. అప్పటికీ మా అమ్మ అప్పుడప్పుడూ అంటానే ఉండేది, 'పిన్నవాఁ ఇంక నీ పట్టింపులు పక్కనపెట్టి రయికగుడ్డ తొడుక్కో పిన్నవాఁ' అని. అది సరేకానీ, సునందత్త మొగుడు అన్నెనక ఎప్పుడు చచ్చిపొయినాడు వా," అడిగినాను దోవమ్మను.

"ఎవుడికి తెలుసబయా, చచ్చినాడో బతికుం డాడో కూడా ఎరగం. సునందమ్మ ఊరందరి ముందూ రయికపాతను విడిచేసినాక, నెలనాళ్లు ఊర్లోనే ఉండి నాడు ముద్దురెడ్డి. ఆలిని కాళ్లూగడ్డాలూ పట్టుకొని బతి

మాలినాడు. ఇక్కనపక్కనోళ్లు సరిది చెప్పబోతే కూడా చెవినేసుకోలేదు సునందమ్మ. ఒక నెల తాలి, ముండ మోసిన పెళ్లాం ముందు ఉండలేక ఏడకో యెలబారి పొయినాడు ముద్దురెడ్డి. ఆనేక ఎవురో గుళ్లకు గోపురాలకు పొయొచ్చినోళ్లు, ముద్దురెడ్డి బ్రమ్మంగారిమటం కాడ ఉండాడనీ, శ్రీశైలంలో కావిగుడ్డలు కట్టుకోని కనపడినాడనీ అనుకొంటా ఉండేవాళ్లు. నిక్కం ఎరిగిన వాళ్లు ఎవురూ లేరు.

"మీ సునందవ్వ మటుకు అన్నెనక రాణి మాదిరి గానే బతికింది. ఆ ఎకరా మిట్టలోనే అన్ని తైదుల్ని పండించుకొంటా, ఒకటో రెండో బరిగొడ్లను మేపుకొంటా బతికేసింది. జరగనప్పుడు కూలికి నాలికి కూడా పొయ్యేది. ఎవురన్నా పని చేయించుకొని రూకలు ఇయ్యకపోతే, ఎవురూ లేని పొద్దులో ఆ ఇంటికిపోయి దేన్నో ఒకదాన్ని దొంగిలించుకొని వచ్చేసేది. ఎవురన్నా ఏదన్నా అంటే ఓ అని అరస్తా పులిమాదిరిగా పైకి దూకేది.

"సునందమ్మ అంటే ఆవూరి మొగోళ్లకు బెదురు, బిత్తర. ఎదురుపడితే చాలు పంచెలు తడుపుకొంటా పక్కకుపొయ్యేవాళ్లు. సునందమ్మ అంటేఈదలకండిగ ఆడోళ్లకు ఒక తెంపు, ఒక తెగవ. పైకి చెప్పకపొయినా లోలోపల మురిసిపొయ్యేవాళ్లు. సునందమ్మ దెబ్బకి, ఆడోళ్ల ముందు నోరెత్తే మొగోడు లేకుండా పొయినాడు ఆవూర్లో," అంటా సునందవ్వ మాటల్ని చాలించింది దోవమ్మ. మాటల్లోనే ఈదలకండిగ ఊరి గమిట్లోకి వచ్చినాము. పాడుపడుండే గమిడిబాయి, దోవమ్మని పలకరించింది. సుంతసేపు ఆ బాయి గట్టుమీద కూచుని అలతను ఆర్చుకొన్నాను నేను.

"అవా లెయివా అట్ట ఊర్లోకి పొయ్యేసొద్దాము," అన్నాను.

"అబయా అక్కడేమీ లేదు. మీ సునందవ్వ బతికి బట్టకట్టిన ఇల్లూ, ఆయమ్మ మిట్టచేనూ, అన్నెనక పేటలో ఆయమ్మ కొడుకు పేరుమీద అరవై అంకణాల చోట్లో ఇరవై అంకణాల ఇల్లుగా మారిపొయినాయి. ఇప్పుడక్కడ ఇంటి దళం కూడా లేదు," చెప్పింది దోవమ్మ.

అంతలోపల్నే పక్కన్నే ఉండే చింతమాను మీద నించి పైడికంటి ఒకటి కీరు కీరుమంటా కేరింది. ఆ ఉలివుకు నేను ఉలిక్కిపడినాను.

"అబయా లెయి నాయినా లెయి. ఇంక కొంచే పటికి చుక్క పుట్టేస్తాది. పదపద తారుబాట కాడకి పోదాం," అంటా నన్ను లేవదీసింది దోవమ్మ.

విరవిర నడిచి రాళ్లకాలవ వంతెన కిందికి వచ్చినాను. చీకటిపాము వెన్నెల గుడ్డును మింగేసుండాది.

"పొయ్యొస్తాను వా," అన్నాను దోవమ్మతో.

"మళ్లా ఎప్పుడొస్తావు అబయా," అరవాయిగా అడిగింది దోవమ్మ.

"వస్తాన్లే వా," అన్నాను. నాది బొల్లికూత అని నాకూ తెలుసు, అవ్వకూ తెలుసు.

"పొయిరా కొడుకా," అంటా నా అరికాళ్లను ముద్దు పెట్టుకొనింది. నేను దోవమ్మను వదలి, తారుబాటను ఎక్కినాను. వంతెనమీదకి పొయి వెనక్కి తిరిగి చూసి నాను. దోవమ్మ కనబడలేదు. వంగి వంతెన కిందకి చూసినాను. నీళ్లులేని రాళ్లకాలవలో కొట్టుకొని పోతా కనపడిందా అవ్వ.

*విశాలాక్షి, అక్టోబరు 2014*

---

| | | | |
|---|---|---|---|
| దవ్వగల్లు | మైలురాయి | వెండిపన్నాడు | శుక్లపక్ష దశమి |
| దూకోలు | అనుభూతి | ననుపిల్లు | ఫ్యాక్టరీ |
| నుగ్గింపు | శాపం | కూటిల్లు | హోటల్ |
| ఆలెకాడు | సర్వర్ | కిల్లాకు | బిల్ |

చనుప/నెరవు/తెరువు/దడము/బడిమి/
పుంత/నడవ/మయి/జాడ/ఓణి/కంతి/చొప్పు : దారి

